Namasthe Telangana Dt 04/04/23



## ‘రాయదుర్గం’లో నాలుగో ద్వారం

సిటీబ్యూరో: మెట్రో కారిడార్-3లోని రాయదుర్గం మెట్రో స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన 4వ ప్రవేశ, నిష్క్రమణ ద్వారాన్ని మంగళవారం ప్రారంభించనున్నట్లు హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఐటీ కారిడార్‌లో చివరి మెట్రో స్టేషన్‌గా ఉన్న రాయదుర్గం వద్ద గతంలో స్థలం అందుబాటులో లేకపోవడంతో 3 ప్రవేశ ద్వారాలనే నిర్మించారు. తర్వాత 4వ ద్వారం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ చేపట్టారు. ఇక్కడి భూమిలో విద్యుత్ లైన్లు ఉండడంతో వాటిని మార్చి కొత్తగా ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను నిర్మించారు. నాగోల్-రాయదుర్గం కారిడార్-3లో చివరి మెట్రో స్టేషన్ కావడంతో అత్యంత రద్దీతో ఈ స్టేషన్ ఉంటుంది. నూతన ద్వారం అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ఎండీ తెలిపారు. ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నామని, అందులో భాగంగానే రాయదుర్గం మెట్రో స్టేషన్‌లో నాలుగో ద్వారాన్ని అత్యాధునికంగా నిర్మించినట్లు చెప్పారు.

Andhra jyothy Dt 04/04/23

ఆంధ్రజ్యోతి

### నేడు రాయదుర్గ్ మెట్రో స్టేషన్‌లో

## నాలుగో ద్వారం ప్రారంభం

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని రాయదుర్గ్ మెట్రో స్టేషన్‌లో మంగళవారం ఆర్మ్-బీ నాలుగో ప్రవేశ ద్వారాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి సోమవారం వెల్లడించారు. కారిడార్-3లోని నాగోలు- రాయదుర్గ్ మార్గంలో రోజూ లక్షన్నరకు పైగా మంది ప్రయాణిస్తుంటారన్నారు. ఇందులో 60వేల మంది కేవలం రాయదుర్గ్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించేందుకు ఇప్పటికే మూడు మార్గాలుండగా, తాజాగా నాలుగో మార్గాన్ని లెమన్ ట్రీ హోటల్ వైపున అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నూతన ద్వారానికి మెట్ల మార్గంతోపాటు ఎస్కలేటర్ సౌకర్యం కూడా ఉంది.

### ఉప్పల్ స్టేడియం స్టేషన్ ద్వారా 40వేల మంది..

ఉప్పల్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ను పురస్కరించుకుని మెట్రో మూడు కారిడార్లలో 4.80 లక్షల మంది ప్రయాణించారు. కాగా, మ్యాచ్ జరిగే సమయంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు, తిరిగి సాయంత్రం 7 నుంచి 10 గంటల వరకు కేవలం ఉప్పల్ స్టేడియం స్టేషన్ ద్వారా దాదాపు 40వేల మంది ప్రయాణించినట్లు మెట్రో వర్గాలు వెల్లడించాయి.